నీటిలో మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, నవంబర్ 22: నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏడుపాయల చెక్‌డ్యాం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా దువ్వెనపల్లి గ్రామానికి చెందిన సాయిలు (35) ఏడుపాయల్లో బంధువుల విందుకు వచ్చాడు. స్నానానికని చెక్‌డ్యాంలో దిగాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సాయిలు మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సాయంతో వెలికితీశారు. కుటుంబకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

చిలిపిచెడ్, నవంబర్ 22: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఆర్ఐ వైదేహి, ఏఎస్సై మిస్బోద్దీన్ హెచ్చరించారు. శుక్రవారం చండూర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. గ్రామ కార్యదర్శి జితేందర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయాలని కార్యదర్శిని ఆదేశించారు.

బోరు మోటర్‌కు మరమ్మతులు

చిలిపిచెడ్, నవంబర్ 22: బద్రియ తండాలో తాగునీటి కోసం తండావాసులు రోడ్డెక్కారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేశ్ రెడ్డి, ఎంపీడీవో ఆనంద్ స్పందించి బోరు మోటర్‌కు మరమ్మతులు చేయించారు. వారితో ఎంపీవో శరత్‌రెడ్డి ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

నిజాంపేట, నవంబర్ 22: రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని ఏవో సోమలింగారెడ్డి డీలర్లకు సూచించారు. శుక్రవారం నిజాంపేటలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏఈవో రాజు, డీలర్లు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

రామాయంపేట, నవంబర్ 22: పశువులకు గాలికుంటు, గర్భ నిర్ధారణ టీకాలు అందిస్తున్నట్లు డీ.ధర్మారం పశువైద్యుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని డి.ధర్మారంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమం

రేగోడ్, నవంబర్ 22: ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరేశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఆయా గ్రామాల పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పెద్దశంకరంపేట, నవంబర్ 22: యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గ్రేసీబాయి అన్నారు. బీఎల్‌వోలకు శిక్షణ నిర్వహించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

రామాయంపేట, నవంబర్ 22: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లోనే ఉండాలని డి.ధర్మారం పీహెచ్‌సీ డాక్టర్ హరిప్రియ అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలోని ఏఎన్ఎం, ఆశవర్కర్లు, సూపర్‌వైజర్లకు అవగాహన నిర్వహించారు.

ప్రభుత్వ బడిలోనే చదవాలి

రామాయంపేట, నవంబర్ 22: బడి మానేసిన విద్యార్థులు వెంటనే బడికి రావాలని ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కోనాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. బడికి ఎందుకు రావడం లేదంటూ విద్యార్థులను ప్రశ్నించారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

చిన్నశంకరంపేట, నవంబర్ 22: రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించాలని ఏవో లక్ష్మీప్రవీణ్ సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని రైతు వేదికలో సేహగల్ ఫౌండేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సౌజన్యంతో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో రాజ్‌నారాయణ్, ఏఈవోలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గౌతమ్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.

NT-338964-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అంకిత భావంతో సేవలు అందించాలి

- వృత్తిపరమైన జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలి
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబర్ 22: అంకిత భావంతో ప్రజలకు సేవలు అందించాలని, వృత్తి పరమైన జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా నుంచి పోలీస్ శాఖకు ఎంపికైన 149 మంది శిక్షణ పూర్తి చేసుకుని బాధ్యతలు తీసుకున్న పోలీసులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా నుంచి 149 మంది ఇందులో 52 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 26 మంది సివిల్ మహిళా కానిస్టేబుళ్లు, 15మంది సాయుధ దళ మహిళా కానిస్టేబుళ్లు, 56 మంది సాయుధ దళ కానిస్టేబుళ్లు 9 నెలల కఠిన శిక్షణ పూర్తి చేసుకుని జిల్లాకు వచ్చారన్నారు. అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉద్యోగం అంటేనే సవాళ్లతో కూడినదని, శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉన్నప్పుడే వాటిని ఎదుర్కోగలమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్ పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

మెదక్ అర్బన్, నవంబర్ 22: రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని దళిత బహుజన ఫ్రంట్ అదనపు కలెక్టర్ నగేశ్‌కు శుక్రవారం వినతి ప్రతంలో కోరారు.

ఎల్ వోసీతో బాధితులకు భరోసా

నర్సాపూర్‌లో ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేటలో ఎల్‌వోసీని అందజేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్: సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులకు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- పేదలకు వరం సీఎంఆర్ఎఫ్
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, నవంబర్ 22: మండలంలోని మూసాపేట్‌కు చెందిన మల్లమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఆపరేషన్ నిమిత్తం రూ.2 లక్షల ఎల్‌వోసీని నర్సాపూర్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, నాయకులు ఆగమయ్య, రవి, కిష్టాగౌడ్, మహేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, నవంబర్ 22: ఎల్‌వోసీతో బాధితులకు భరోసా వస్తుందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని శభాష్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ షాహినోద్దీన్ చికిత్స పొందుతున్నాడు. ఎల్‌వోసీకి దరఖాస్తు చేసుకోగా రూ.1.50 లక్షల ఎల్‌వోసీ చెక్కు మంజూరు చేయించారు. వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ పార్వతీసత్యం ఉన్నారు.

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, నవంబర్ 22: పేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 13మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్ రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అందజేశారు. చిట్కుల్‌కు చెందిన సత్యానారాయణకు రూ.12 వేలు, సంధ్యకు రూ.12 వేలు, శీలాంపల్లికి చెందిన బాల్‌రెడ్డికి రూ.34,800, గంగారం గ్రామానికి చెందిన రాజమల్లయ్యకు రూ.12,500, చండూర్‌కు చెందిన మొగులమ్మకు రూ.26 వేలు, నరేశ్‌కుమార్‌కు రూ.21వేలు, శాంతకు రూ.26 వేలు, సత్తయ్యకు రూ.26 వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, భీమయ్య పాల్గొన్నారు.

రైస్ మిల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

చిట్కుల్ శివారులో నిర్మించిన రైస్ మిల్లును ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రైస్‌మిల్లు యజమానులు విశ్వంభర స్వామి, మాంతప్ప, గోపాల్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిట్కుల్‌లోని చాముండేశ్వరీ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకున్నారు.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

- జిల్లాలో సర్వే 91.31% పూర్తి
- కలెక్టర్ రాహుల్ రాజ్

చిన్నశంకరంపేట: డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో నూర్‌లో ఎంపీవో విఘ్నేశ్వర్‌తో కలిసి పరిశీలించారు.

మెదక్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): సమగ్ర సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. డేటా ఎంట్రీ నిర్వహణపై కంప్యూటర్ ఆపరేటర్స్, మండల అభివృద్ధి అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, కుటుంబ సర్వే పారదర్శకంగా నిర్వహించామన్నారు. డేటా ఎంట్రీలో కోడింగ్ విధానం పరిశీలించుకోవాలని, పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. ఇప్పటివరకు 91.31 శాతం సర్వే పూర్తయిందన్నారు.

డాటాను సరిగా నమోదు చేయాలి

చిన్నశంకరంపేట, నవంబర్ 22: కుటుంబ సర్వే డాటాను కంప్యూటర్‌లో సరిగా నమోదు చేయాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో దామోదర్ ఉన్నారు.

ఉమ్మడి మండలంలో 99 శాతం సర్వే పూర్తి

వెల్దుర్తి, నవంబర్ 22: సర్వే ఉమ్మడి వెల్దుర్తి మండలంలో 99 శాతం పూర్తయ్యిందని ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు. కుకునూర్‌లో ...

డేటా ఎంట్రీలో తప్పులు నమోదు చేస్తే చర్యలు

మెదక్‌రూరల్, నవంబర్ 22: డేటా ఎంట్రీ ఆపరేటర్లు సర్వే డేటాలో తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని ఆర్డీవో రమాదేవి సూచించారు. మెదక్ ఎంపీడీవో కార్యాలయంలో సర్వే డేటా ఎంట్రి ప్రకియను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో రఘు, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, సిబ్బంది కిశోర్, సాయికుమార్ ఉన్నారు.

90 శాతం కులగణన సర్వే పూర్తి

చిలిపిచెడ్, నవంబర్ 22: మండలంలో సర్వే 90 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. బండపోతుగల్, చండూర్, చిట్కుల్, ఫైజాబాద్, సోమక్కపేట ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో శరత్‌కుమార్ రెడ్డి పర్యవేక్షించారు. వారితో గ్రామ కార్యదర్శులు తిరుపతి, జితేందర్, ఆనంద్ ఉన్నారు.

ప్రతి విద్యార్థిలో శాస్త్రీయ వైఖరి పెంపొందించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, నవంబర్ 22: ప్రతి విద్యార్థిలో శాస్త్రీయ వైఖరి పెంపొందించేలా గ్రౌండ్ బేస్ లెర్నింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రౌండ్ బేస్ లెర్నింగ్ కార్యక్రమంపై ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పునాది గట్టిగా ఉంటే ముందు స్థాయి తరగతుల్లో వారు ఎంచుకున్న రంగంలో నిష్ణాతులవుతారన్నారు. పిల్లలకు సబ్జెక్టుల్లో నాణ్యమైన, గుణాత్మక విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: కుకునూర్‌లో సర్వే

ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

చిన్నశంకరంపేట, నవంబర్ 22: కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డల తల్లిదండ్రులకు వరంలాంటిదని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. రుద్రారం గ్రామానికి చెందిన సాయికుమార్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2,50 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఏఎంసీ మాజీ చైర్మన్ గంగానరేందర్, పార్టీ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జీవన్, రమేశ్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, భిక్షపతి, శ్రీనివాస్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

నిబద్ధతకు మారు పేరు గిరిజనులు

పాపన్నపేట, నవంబర్ 22: నిబద్ధతకు మారు పేరు గిరిజనులని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని మొదల్లకుంట తండాలో జగదంబికామాత, సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గోవింద్‌నాయక్, శ్రీకాంత్, గౌస్, శ్రీనివాస్, నరేందర్‌గౌడ్, నర్సింలు ఉన్నారు.

మెదక్‌కు నర్సింగ్ కళాశాల మంజూరు

మెదక్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : మెదక్‌కు నర్సింగ్ కళాశాల మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.26 కోట్లు మంజూరు చేసింది. మెదక్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలో ఇటీవల తరగతులు ప్రారంభమయ్యాయి. మెడికల్ కళాశాలకు అనుసంధానంగా బోధన దవాఖానతో పాటు నర్సింగ్ కళాశాలలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నర్సింగ్ కళాశాలలో 60 సీట్లతో ప్రవేశాలు కల్పించి ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే నర్సింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను నియమించడంతో పాటు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారు. నర్సింగ్ కళాశాలను మెడికల్ కళాశాల సమీపంలోని ఓ ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ స్టేట్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్ఎంఐడీసీ) ఆధ్వర్యంలో ఫర్నిచర్, సౌకర్యాలు సమకూర్చనున్నారు. నర్సింగ్ కళాశాల ఏర్పాటుతో జిల్లా విద్యార్థులకు నర్సింగ్ విద్య అందుబాటులోకి రానున్నది. బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు వరంగా మారనున్నది. ఈ కోర్సులో సీట్లు దొరకని విద్యార్థులు చాలామంది మహారాష్ట్ర, కర్ణాటక, హైదరాబాద్ తదిరత ప్రాంతాలకు వెళ్లి లక్షల రూపాయలు వెచ్చించి చదువుతున్నారు. ఇప్పుడు జిల్లాలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు కానుండడంతో వారికి వరంగా మారనున్నది.

సీఎంఆర్ఎఫ్ వరం: ఎమ్మెల్యే సునీతారెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కౌడిపల్లి, నవంబర్ 22: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో కౌడిపల్లి గ్రామానికి చెందిన వడ్డే అంజయ్యకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోల నవీన్‌కుమార్. సందీప్, ఫయాజ్, భిక్షపతి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మెదక్ అర్బన్: జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

మెదక్ అర్బన్, నవంబర్ 22: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుకుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మెదక్‌లోని అథ్లెటిక్స్ స్టేడియంలో తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో అండర్ 8, 10, 12 బాలబాలికలను ఎంపిక చేశారు. జిల్లా నుంచి 200 మంది పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన 25 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్ 1వ తేదీ మంచిర్యాల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ జిల్లా తరపున వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

వెల్దుర్తి, నవంబర్ 22: క్రీడలు విద్యార్థులకు మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందని మాసాయిపేట ఎంఈవో లీలావతి అన్నారు. శుక్రవారం మాసాయిపేటలో ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభించారు. పోటీలతో జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్లు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

మాసాయిపేటలో సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో లీలావతి

లారీ, బైక్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి

మెదక్ అర్బన్, నవంబర్ 22: అతివేగంగా వచ్చిన లారీ, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మెదక్‌లోని పిల్లకోటాల్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన నవీన్ (25), అతని సోదరి భాగ్య, వంశీ (23) బస్‌పాస్ రెన్యువల్ చేసుకోవడానికి మెదక్‌కు వస్తున్నారు. మెదక్‌లోని పిల్లికొట్టాల్ సమీపంలో అతివేగంగా వచ్చిన లారీ, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఘటనా స్థలంలో వంశీ మృతి చెందాడు. నవీన్ మెదక్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి మృతి చెందాడు. భాగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలానికి పోలీసులు చేసుకుని మృతదేహాలను మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా తూకం వేయాలి

డీఆర్‌డీఏ అడిషనల్ అధికారి సరస్వతి

శివ్వంపేట: చెన్నాపూర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ అధికారిణి సరస్వతి

శివ్వంపేట, నవంబర్ 22: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం తూకం వేయాలని డీఆర్‌డీఏ అడిషనల్ అధికారిణి సరస్వతి సూచించారు. శుక్రవారం మండలంలోని చిన్నగొట్టిముక్ల, చెన్నాపూర్, తిమ్మాపూర్, ఏదుల్లాపూర్ గ్రామాల్లో ఆమె విస్తృతంగా పర్యటించారు. వెంటవెంటనే ధాన్యం కాంటా వేయాలని, మ్యాచర్‌ను సరిచూసుకోవాలన్నారు. ఆమె వెంట ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

లారీల కొరత లేకుండా ధాన్యం తరలిస్తాం

రామాయంపేట, నవంబర్ 22: లారీల కొరత లేకుండా ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తామని తహసీల్దార్ రజినీకుమారి అన్నారు. శుక్రవారం రామాయంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. 60శాతం మేర ధాన్యం రైస్‌మిల్లులకు తరలించినట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట, నవంబర్ 22: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. మండలంలోని కొర్విపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.

కొనుగోలులో జాగ్రత్తలు వహించాలి

పాపన్నపేట, నవంబర్ 22: రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని డీఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నార్సింగి, అర్కెల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీంచి సూచనలు చేశారు. ఏపీఎం సాయిలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

టేక్మాల్‌లో మెడికో అంత్యక్రియలు పూర్తి

స్నిగ్ధ (ఫైల్)

టేక్మాల్, నవంబర్ 22: ఫిలిపిన్స్‌లో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న టేక్మాల్ గ్రామానికి చెందిన చింత స్నిగ్ధ (20) పుట్టినరోజున అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. టేక్మాల్‌కు చెందిన చింత అమృత్ రావు మెదక్ జిల్లాలో ఎలక్ట్రిసిటీలో డీఈగా పనిచేస్తున్నారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలో నివాసముంటున్నారు. ఆయన కూతురు స్నిగ్ధను ఎంబీబీఎస్ చదివించేందుకు 2021లో ఫిలిపిన్స్ దేశంలోని మనీలాలో ఫర్ ఫెక్చువల్ హెల్త్ యూనివర్సిటీలో చేర్పించారు. ఈ నెల 15వ తేదీన పుట్టిన రోజు సందర్భంగా బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపేందుకు తల్లిదండ్రులు ఆమెకు ఫోన్ చేశారు. కాగా ఆమె లిఫ్ట్ చేయలేదు. ఆ తర్వాత ఆమె స్నేహితులకు ఫోన్ చేయగా స్నిగ్ధ చనిపోయినట్లు చెప్పారు. మృతదేహాన్ని త్వరగా తెప్పించేందుకు ఇండియన్ ఎంబసీ చర్యలు తీసుకోవడంతో వారం రోజుల తర్వాత ఆమె స్వగ్రామమైన టేక్మాల్‌కు మృతదేహం చేరుకున్నది. శుక్రవారం స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. కడసారి చూడటానికి బంధువులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

వెంకటేశం (ఫైల్)

శివ్వంపేట, నవంబర్ 22 : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కుల్ల వెంకటేశ్(24) కొంతకాలంగా పనిచేయకుండా ఇంటివద్ద ఖాళీగా ఉంటున్నాడు. తల్లికి ఆర్థికంగా సాయం చేయడం లేదని మనస్తాపంతో ఈ నెల 21న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం వెంకటేశ్ మృతదేహాన్ని చూసి స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు పరిశీలించారు. మృతుడి తల్లి కుల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పంటల అవశేషాలను కాల్చేస్తే దిగుబడి రాదు

పంటల అవశేషాలను కాల్చేస్తున్న రైతులు

రామాయంపేట, నవంబర్ 22: పంట అవశేషాలను కాల్చొద్దంటూ గ్రామాల్లో చాటింపు చేసినా, పంచాయతీ కార్యాలయాల్లో రైతులకు అవగాహన కల్పించినా రైతులు వినడం లేదని ఏవో రాజ్‌నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రామాయంపేటలో ఆయన మాట్లాడుతూ పంట వ్యర్థాలు కాల్చితే భూమిలోని కర్బణ పదార్థాలు కాలిపోయి, రసాయనాలు లేకుండా చేస్తాయన్నారు. ఇవి ఉంటేనే పంటలు బాగా పండి దిగుబడి వస్తుందన్నారు. పంటలను కాల్చడంతో భూమిలోని పోషకాలు ఉండవన్నారు. పోషకాలు ఉండాలంటే పంటలను కాల్చకుండా వరి కర్రలను అడుగు భాగం వరకు కోసేసి అదే భూమిలో వేసి కలియ దున్నాలని, దీంతో దిగుబడి పెరుగుతుందన్నారు.

బీజేపీ రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

నర్సాపూర్, నవంబర్ 22: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.మల్లేశం ఆరోపించారు. శుక్రవారం నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ల ప్రయోజనం కోసం దేశ సంపద పూర్తిగా తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నట్లు విమర్శించారు. నాయకులు నాగరాజు, అన్నపూర్ణ, రమేశ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ మహేందర్

పాపన్నపేట, నవంబర్ 22: మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని అడిషనల్ ఎస్పీ మహేందర్ సూచించారు. శుక్రవారం ఏడుపాయల్లో జైభీం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో అడిషనల్ ఎస్పీ మాట్లాడారు. చెడు వ్యసనాలు ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితులను పాడు చేస్తాయన్నారు. యువత వాటికి అలవాటు పడి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జైభీం అధ్యక్షుడు పాతూరి రాజు, సామెల్, బీసీ సంఘం అధ్యక్షుడు నోముల శ్రీకాంత్ గౌడ్, గౌరవ అధ్యక్షులు గంగారాం, గుండు మల్లేశం, ఇసాక్, మురళి పాల్గొన్నారు.